# సంఘర్షణలోనే అందం ఉంది

-మూలం: బంశీలాల్ పర్మార్ (హిందీ గల్పం)
అనువాదం: ఆర్. శాంతసుందరి

నన్ను గనుల్లోంచి తవ్వితీసి ఉక్కు కర్మాగారాల్లోకి తీసుకొచ్చారు. ఆ తరువాత కర్మాగారంలో కోక్‌బొగ్గు, సున్నపురాయి, ఇంకా ఏవేవో పదార్థాలని కలిపి నన్ను విపరీతమైన వేడిగల అగ్గిలో కాల్చి, కరిగించిన లావాలాగ తయారు చేశారు. అచ్చుల్లో పోసి, నన్ను రైలు పట్టాలుగా మార్చారు. నన్ను రైలు పెట్టెల్లోకి ఎక్కించి, కొత్త రైల్వే లైను వేసే చోటికి చేర్చారు. అక్కడికి నేనొంటరిగా పోలేదు, నాతోపాటు ఎంతోమంది స్నేహితులు కూడా వచ్చారు.

స్లీపర్ల పరుపుల మీద మమ్మల్ని పడుకోబెట్టారు. కొందరు నాతో కలిశారు, కొందర్ని నాకు సమాంతరంగానూ కొందర్ని నా పక్కనే విడిగానూ పేర్చారు. రైల్వే స్టేషన్‌కి దగ్గరగా, మెయిన్ లైన్లు మారేచోట నన్ను ఉంచటం మంచిదయింది. కానీ నా కన్నా ఎక్కువ లోకజ్ఞానం ఉన్న నా స్నేహితురాలొకతె "నేనెంతో అదృష్టవంతురాలిని. జీవితాంతం సుఖంగా ఉంటాను. ఎందుకో తెలుసా? నేను సైడ్‌లైన్‌లో ఉన్నాను. కానీ నిన్ను చూస్తే నాకు జాలి వేస్తోంది!" అంది.

నేను భయం భయంగా, "ఎందుకు?" అని అడిగాను.

"నువ్వు మెయిన్ లైన్‌లో ఉన్నావు, ఒక్క క్షణం కూడా నీకు విశ్రాంతి దొరకదు. రైలుబళ్లు నీ మీదినించి ఇరవై నాలుగ్గంటలూ వెళ్తూనే ఉంటాయి. వాటి బరువుకీ, అవి చేసే చప్పుడుకీ నువ్వు చచ్చూరుకుంటావు." నా మీద సానుభూతి కురిపించింది నా స్నేహితురాలు.

ఆ రాత్రి నాకు నిజంగానే నిద్ర పట్టలేదు. నేను చాలా దిగులుగా ఉండసాగాను. చివరికి కొత్త రైల్వే లైన్ ప్రారంభోత్సవం జరిగింది. నా స్నేహితురాలు చెప్పింది అక్షరాలా నిజం! చాలా బిజీ లైనవటంతో రోజూ ఎడతెరిపి లేకుండా రైళ్లు నా మీంచి పరిగెత్తుతూనే ఉంటాయి. అలుపు తీర్చుకోవటానికి తీరికే దొరకదు. నెమ్మది నెమ్మదిగా నేను దానికి అలవాటుపడిపోయాను. కొద్ది రోజులకి నా రూపంలో మార్పు వచ్చింది. నేను వెండిలా ధగధగ మెరవసాగాను. నా అందం రోజురోజుకీ పెరుగుతోంది. కానీ నా దురదృష్టాన్ని చూసి జాలిపడిన నా స్నేహితురాలు రోజురోజుకీ మెరుపు తగ్గిపోసాగింది. కర్మాగారం నుంచి నీలం రంగులో వెలికి వచ్చిన తను తుప్పుపట్టి అందవికారంగా తయారయింది.

నా మీది అసూయతో ఒకరోజు అడిగేసింది, "ఏమే! నీ అందం రోజురోజుకీ ఇలా పెరిగిపోవటం వెనక ఉన్న రహస్యం చెప్పవూ?" నేను మాత్రం ఇలా కళ తగ్గి ఘోరంగా తయారవుతున్నాను. ఏమిటే కారణం?"

"సంఘర్షణ చేసేవాళ్లెప్పుడూ అందంగా తయారవుతారు, దాన్నించి దూరంగా పారిపోయేవాళ్లు నీలాగ అందవికారంగా అయిపోతారు" అని అన్నారు.

అదే సమయంలో ఒక రైలుబండి అమిత వేగంతో నా మీదినుంచి వెళ్లింది. ఇవాళ అది చేసే చప్పుడు నాకు రొదలాగ అనిపించలేదు, చెవికింపైన సంగీతంలా అనిపించింది, దాని స్పర్శ నన్ను పులకరింపజేసింది. నిజంగానే ఈరోజు నాకెంతో ఆనందంగా ఉంది! ■

## సందేశం

నిన్నటి సంవత్సరానికి
వీడ్కోలు ఇస్తూ
రేపటి వత్సరానికి / స్వాగతం చెబుతూ
ఓ నిర్ణయానికొద్దాం
జీవితాన కారం, తీపిలా
కష్టాన్ని సుఖాన్ని ఒకే రీతిలో
అనుభవిద్దాం
పులుపు, చేదులులా
వ్యంగ్య, వికారాలకు
కాస్త దూరంగా మసిలి
ప్రేమను ఆహ్వానిద్దాం
మానవత్వపు మధురిమతో
చేతులు చేతులు
కలుపుకుంటూ సాగుదాం
ముందుకు సాగుదాం!

-యలమర్తి అనూరాధ